

కథా కౌముది

# నల్ల పూసలు

సురేఖ పులి

"మీ యమ్మ బతికుంటే ఎంత ఖుష్ పడుతుండే శివా.." వికలాంగుల వాటాలో జిల్లా పరిషత్ ఆఫీస్ ఉద్యోగం సంపాదించుకున్న కొడుకును చూసి కన్నీరు తుడుచుకుంటూ దేవయ్య అన్నాడు.

"బాపు, దా.. అమ్మకు మిఠాయి, పండ్లు పెట్టిన; ఫోటోకు పూల దండేసి ఊదృత్తి ముట్టియ్, పుల్లల్దబ్బి ఇగో" చేతికి అగ్గిపెట్టెను అందించాడు.

దేవయ్య భార్య మణెమ్మ ఫోటో వైపు అగరవత్తులు వెలిగించాడు. తండ్రీ కొడుకులిద్దరూ భక్తిగా మొక్కుకున్నారు.

"అమ్మా, నాకు గవర్నమెంట్ నౌకరి దొరికింది. నువ్వు లేవన్నమాట ఒట్టిది. హమేషా మాతోనే ఉన్నవ్. నా తల నీ కడుపుల పెట్టుకో.. దీవెన ఇయ్యమ్మా!" శిరసు వంచి దండం పెట్టుకున్నాడు.

"అంతగనం జల్ది ఏమొచ్చింది మనీ? మమ్ముల ఒల్లక ఎల్లిపోయినవు, నువ్వు పోబట్టి ఈడ వుండ బుద్దయిత లేదే" మనసులో అనుకున్న మాట, ఆగక బయటికి అనేశాడు.

★★★

వయసులో ఉన్నప్పుడు దేవయ్య, మణేమ్మ ఒకర్నొకరు ఇష్టపడ్డారు. "నువ్వు సదుకోక, కూలి పన్జేస్తున్నవని మా ఇంట్ల నిన్ను వొద్దంటన్నరు."

"పిల్ల కర్రెగుంది. తెల్లగ ఉన్న పిల్ల చూస్కో" ఇంటి కోడలుగా వద్దన్నారు.

“నువ్వేమన్న తెల్లగున్నవా?” ఆమె ఎక్కిరిస్తే ఆయన నవ్వుకున్నాడు.

ఒకరంటే ఒకరికి వల్లమాలిన ప్రేమతో పల్లె నుంచి పారిపోయి పట్నం వచ్చారు. పెళ్లి చేసుకునేందుకు డబ్బు లేదు. కలిసి బతకడానికి డబ్బు సంపాదించాలి.

‘పెండ్లి అయింది, వూరొదిలొచ్చి ఏదన్న పనో, కూలో దెవులాడుతున్నం’ అందర్నీ నమ్మించి ఎక్కడ అపార్ట్మెంట్ కడుతుంటే అక్కడికి కూలి పని చేసుకుంటూ చిలకా గోరింకల్లా ఉన్నారు.

“ఇంకా మన పెండ్లి కాలే, నాకు కడుపొచ్చింది, సుట్టుముట్టు ఎవలన్నడిగితే ఏం సెప్పాలె?” దిక్కుతోచక మణెమ్మ భర్తను అడిగింది.

“నీ మెడల నల్లపూసలు ఉన్నంక ఆ షకు ఎందుకొస్తది? అట్ల ఎవ్వలడగరు, పెండ్లనేడిది ఊరోల్లకోస్రమే. ఎవలన్న అడిగిందాకా మామ్లును గుంజకు..” నచ్చచెప్పాడు.

శివాజీ పుట్టాడు, సరైన వైద్యం అందక పోలియో వచ్చి కుడి కాలు చప్పబడిపోయింది. పట్టుదలతో కొడుకును చదివించుకున్నారు. పన్నెండో క్లాస్లో ఉన్నప్పుడు మణెమ్మ సిమెంట్ సంచులు మోసే క్రమంలో ఊపిరితిత్తులు దెబ్బ తిన్నాయి.

“దగ్గి, దగ్గీ.. నా పానమ్ పోతదేమో, నా కొడుకు బాగా సద్వి, గవర్నమెంటు డ్యూటీ చేయాలే.” ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధికి వైద్యం తీసుకున్నా ఆయువు దక్కలేదు. దేవయ్య గుండెలు పగిలిపోయేలా విలపించాడు. “నాల సగం అనుకుంటి మనెమ్మా! పురాగా మొత్తమంతా దేవునికి పానమై పోతివా!?” కన్నీరు ఆగలేదు పని మానేసి పిచ్చోడయ్యాడు.

“బాపు, మనిద్దరం కల్సి సచ్చి పోదమా?” తండ్రి దీనావస్థ చూడలేక అన్నాడు శివాజీ.

“ఏం చెయ్యల్నో తోస్తలేదు బిడ్డా” దేవయ్య కొడుకు ఒడిలో తల పెట్టుకొని విలపించాడు.

“నీ గవర్నమెంటు కొలువు సూడలన్నది మని. సూడకనే పాయే!.. నువ్వు ఈ భూమ్మీద వుండురా, నేన్ సచ్చిపోత” కొద్దిసేపు తండ్రి బాధకు అడ్డు చెప్పలేదు.

“బాపు, ఇద్దరం బతుకుదాం, ఎన్నడైనా నువ్వు, నేను సచ్చిపోయేటోల్లమే. ఏమిటికి జల్దీ సావాలే? సచ్చి ఏం పీకత్తం? నేను ఎట్లయినా నౌకరీ దెచ్చుకుంటా, ఫికర్జేయకు” తోచినట్టు తండ్రిని ఓదార్చాడు.

★★★

దేవయ్య దృష్టిలో శ్రీనాథ్ బిల్డర్స్ యజమాని శ్రీరామ్ గారు ప్రత్యక్ష దైవం! ఎక్కడ అపార్ట్మెంట్ నిర్మాణం జరుగుతుంటే అక్కడ దేవయ్య కూలి పని చేయాల్సిందే. కానీ యజమానికి దేవయ్య ఒక కూలోడు మాత్రమే.

“కొన్ని నెలలు ఫారిన్ లో మా పిల్లల దగ్గరికి పోవాలనుకున్నా. నా ఇంటికి నువ్వు కాపలా ఉండాలి, పక్కనే ఉన్న సర్వెంట్ క్వార్టర్ నువ్వు వాడుకో దేవా!”

“సారు, ఎంత పెద్ద మాట! ఇన్ని రోజుల సంది నాకు బువ్వ పెట్టిన దొరవి! ఎట్ల జెప్తే అట్లనే చేస్త, ఇంకో ముచ్చట లేదు.”

“నేనుండ కదా, నీకు సగం జీతం మాత్రమే ఇస్తాను” ప్రతీ రూపాయి లెక్క కట్టే యజమాని కట్టడి.

“సరే సారు” జీవితం అంటేనే సర్దుబాటు అని తెలుసు దేవయ్యకి.

“మరి నీ రోజువారీ ఖర్చులు ఎట్లా? ఎక్కడ నుండి సంపాదిస్తావు?” అనుమానంగా అడిగాడు యజమాని.

“చూస్త. పని దెవులాడ్త” నమ్మకంతో చెప్పాడు.

దేవయ్య నమ్మకం పైన నమ్మకం లేక “డ్రైవింగ్ నేర్చుకో, లైసెన్సు తెచ్చుకొని, నా ఆటో ట్రాలీ నడుపు. ఏదో కొంత సంపాదిస్తావు. డ్రైవింగ్ బాగానే వచ్చిందని అనిపిస్తే అప్పుడప్పుడు నా టూ వీలర్, ఫోర్ వీలర్ కూడా నడుపుతూ ఉండు. వాటిని నడపక పక్కన పెడితే పాడైపోతాయి” ఒక దెబ్బకు రెండు బదులు నాలుగు పిట్టలు కావాలనుకున్నాడు.

“సారు, నా మీదింత భరోసా ఉంచిద్రు, దండాలు!” కాళ్ళకు దండం పెట్టి దేవయ్య కృతజ్ఞత తెలియచేశాడు.

“వేరే ఎవరో ఎందుకు, నేనే నీకు డ్రైవింగ్ నేర్పిస్తా” అదే రోజు నుండి డ్రైవింగ్ మొదలు పెట్టాడు.

“సార్, నేను బి నేర్చుకుంటా” శివాజీ కూడా తోడు వెళ్ళాడు.

“నేను తిరిగి రాగానే నాకు నా ఇల్లు, వెహికల్స్ జాగ్రత్తగా అప్ప చెప్పాలి. అన్నిటినీ ఇన్సూర్ చేయించాను.”

శ్రీరామ్ అప్పగింతలు చేసి కొడుకు శ్రీనాథ వద్దకు వెళ్లి పోయాడు. తూచ తప్పకుండా శ్రీరామ్ ఆస్తిని కంటికి రెప్పలా కాపాడుతూ, ఆటో ట్రాలీ నడుపుకుంటూ రోజులు గడిచిపోతున్నాయి.

★★★

"బాపు, ఈ ఏడాదికి నాకు డిగ్రీ వస్తది, నేను కంప్యూటర్ నేర్చుకుంటా, నెలకు ఐదు వేల ఫీజు కట్టాలె" ఆశతో అడిగాడు.

"ఇప్పుడైతే ఇస్తగాని, ఇగ మీదట నువ్వే చూస్కో.. నాకాడ ఒక్క పారి ఇంత గనం పైసలియ్యలంటే నాతోన గాదు. కాలేజుకు పోతనే వున్నవ్, ఇంగా బయిటికి పోయి ఏం ఎల్ల బెడ్తవ్ రా?"

"కంప్యూటర్ ఎం.ఎస్.ఆఫీస్; జరంత ప్రోగ్రామ్లు నేర్చుకుంటా."

"అగో.. డ్యూటీ రాక మున్పే నువ్వు 'ఆఫీస్' పని నేర్చుకుంటున్నావ్!" సంబరపడ్డాడు. విడమర్చి చెప్పే ఓపిక లేక తండ్రి వద్ద నుండి అధనం డబ్బులు తీసుకున్నాడు.

రైస్ మిల్స్, క్యాటరింగ్, జనరల్ స్టోర్స్, టింబర్ డిపో, నిత్యావసర రవాణా వ్యాపారస్తులకు "ఇది బిడ్డ ఫోన్ నంబరు, ఎదన్న గిరాకి వస్తే చెప్పమని" వేడుకున్నాడు.

ఆటో ట్రాలీ దందా సుఖంగా సాగుతుంది. శ్రీరామ్ ఇంటిని, వాహనాలను శుభ్రపరచి, భార్య ఫోటో చూసుకుంటూ సంతోషంగా తాజా ముంత కల్లు తాగి తృప్తి చెందేవాడు దేవయ్య.

★★★

అనువైన సమయం చూసి "బాపు, సోనాబాయి అని నా ఎంటనే కంప్యూటర్ కాడా దోస్త్, సక్కగ బాగుంటది. ఆమె.. నేను లవ్ల ఉన్నం. నేను పెండ్లి చేసుకుంటా, నువ్వేమంటావ్?" ఎర్రగా వేయించిన చేప ముక్క నోటికందిస్తూ గారాబంగా చెప్పాడు.

కొడుకు కళ్ళల్లోకి తీక్షణంగా చూసి "డ్యూటి ఎక్కి యాడాదన్నా పురాగ కాలే, ఇంత జల్ది పెండ్లెందుకు బెటా? బ్యాంక్ల జరన్ని పైసల్ జమ గానీ, పిల్ల యాడికి పోతది? బాయిని జర ఓప్క పట్టమను."

"జల్ది ఐమెక్కాదు. బల్కె, వాండ్ల ఇంటోల్లు ఏరే పెండ్లి చేస్తరంట. అస్సలు వాండ్ల ఇంటోల్లకు నేను పసందేను. మేమిద్రం గుడిల పెండ్లి జేస్కుందాంనుకున్న."

“అట్ల? ఈ ముచ్చట శానాల్లా సంది నడుస్తున్నాది, తీరా.. ఇప్పుడ్జేప్తున్నవూ? ఉషరయినవు!” ముంతలోని కల్లు పూర్తి చేశాడు.

“అరె, శివగా.. నీ పెండ్లి, నీష్టం. ఒక్కటి యాద్ పెట్టుకో బెటా! మీద్దరూ సచ్చేదాక కల్సి వుండాలే. ప్రేమించుకున్నా, తిట్టుకున్నా, కొట్టుకున్నా.. అస్సలు అలగ్ కావొద్దు” మత్తుగా మాట్లాడుతున్నాడు.

శివాజీ అన్నిటికి తల ఊపుతున్నాడు. “శివా, ఇను.. దండలు మార్సుడు, పబ్లిక్ ముంగట బాజా ఊదుడు, డప్పులు కొట్టుకుంట.. అదేంది? అదేరా.. తియ్యగుంటది.. పప్పు బాగారిస్తమ్..? యాదికొచ్చినంది.. ఆవాల్ జిలకర,.. బెల్లం; జిలకర్బెల్లం నెత్తి మీద పెట్టి ఒట్టని పుస్తె కట్టుడు, మెట్టెలు తొడుగుడు, పచ్చ బియ్యం నెత్తి మీద గుమ్మరించ్కం.. ఇయన్ని బేఖార్!!” తూలుతున్న తండ్రిని పట్టుకున్నాడు.

“నేనేం పడ, నన్నోదులు.. ఒట్టేసి చెప్తున్నా, నేను మీ యమ్మ.. శానా ఇదిగా దగ్గరైనం. పెండ్లి చేసుకోలే. బారాల్, ఘరేలు జిందగీ మస్తుగా నడిపినం. ఇద్దరం అలగలగా లేం. ఒక్కటింగ! కస్టాలల్ల సుకాలు జూసుకున్నం. పని కాడెంత మంది ఆడోల్లు నా ఎంట పడ్డరో! ఎంత మంది మగోల్లు అమ్మ ఎంట పడ్డా! దీనియమ్మ.. ఇద్రం నీయత్గ ఆలుమగలగ ఉన్నం.. అర్తం ఐతుందా బెటా?”

“ఐతుంది బాపు.”

“ఆ.. గదే.. బాయి ని ఇంటికి తోల్కరా..” నిద్రలోకి జారుకున్నాడు. శివాజీ తండ్రిని కుదురుగా పడుకోబెట్టి దుప్పటి కప్పి సంతోషంగా నిద్ర పోయాడు.

★★★

“నేనిచ్చిన ఎర్ర డ్రస్ ఏసుకో, ఈ నల్లరంగొద్దు” శివ అభ్యంతరం చేశాడు.

“ఇన్నేల్ల దోస్తానల నువ్విచ్చింది ఒక్కెర డ్రెస్! తొడిగి తొడిగి సింపులైతున్నది. నల్లదైతే ఏంది? బాగ లేనా?” సోనాబాయి వయ్యారంగా అంది.

“ఎట్లున్న సక్కని సుక్క సోన్వి. మా నాయిన నిన్ను సూడంగానే మంచి పిల్లని జల్ది పెండ్లికి హా జెప్పాలే. శానా మంది నల్ల రంగంటె బ్యాడ్ అంటరు.. గందుకే వద్దన్న” ప్రేయసి వయ్యారానికి ముగ్ధుడయ్యాడు.

“ఎవ్వలతో నాకేంది లెక్క? ముండ మోస్తే తెల్ల సీరె కడతరు, నల్లది బ్యాడైతే నల్ల సీరె గట్టాలే! తిండెక్కువైతే గీ లెక్కలన్ని..” లోకం పోకడ వెల్లడించింది.

“ఎర్ర టికిలి పెట్టు.”

“ఎర్ర టికిలి నల్ల డ్రెస్కు మ్యాచ్కాదు. ఏదైతేంది? ఇయన్ని ఇడసబెట్టు. మీ నయిన పెండ్లికి ఒప్పకోకుంటే? ఇద్రం గుల్లే నో, సైన్ల పెండ్లో..”

“ఒక్కటే మాటెన్ని మాట్లడుగుతవ్? యాస్ట్ దెప్పిస్తున్నవ్!” చిరాకు పడ్డాడు.

“అరె, అడ్గితే ఏమైతది, అట్ల సుర్రూమంటవూ? చిరు కోపం నటించింది.

“ముందుగాల ఆటో ఎక్కు..” ఆటో కూర్చోడానికి సానుకూలంగా ఉన్నా సోనీ మురిపెంగా శివను అదుముకొని కూర్చుంది.

★★★

“నా కొడుకును ఏంజూసి పసంద్ జేసినవమ్మా?” ఇంటికి వచ్చిన సోనాబాయితో అన్నాడు దేవయ్య.

“ఏమో ఎర్కలే.. నా కీడ నచ్చిండు, పెండ్లిగిట్ట ఐతే శివ తోనే పుస్తె గట్టించుకుంట!” గుండెను సూచిస్తూ చేతులతో గుచ్చి చెప్పింది సోనాబాయి.

“బెటా, శివా.. నువ్వెందుకు సోనాబాయ్ని పసంద్జేస్నవ్?” సూటిగా ప్రశ్నించాడు.

“బాపు, నేను కుంటోడని ఎరికైనా; నేనే జిగ్రి జాన్ంట! నన్ను లవ్ జేస్తుంది.. పసంద్జైంది” బెరుకుగా, సిగ్గు దాచుకోవాలని ప్రయత్నిస్తూ చెప్పాడు.

“బాయి, మీ ఇంటి కాడొద్దన్నరు, మరేం జేస్తవ్ తల్లీ? అనునయంగా అన్నాడు.

“నేనేమన్న బుడ్డ పోర్నా? నాకేది పసందైతే అదే జేస్త. సిన్న పిల్లన్గాను” పట్టుదలతో చెప్పింది.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి గుడిలో పెళ్లి జరిగింది. సోనాబాయి వైపు పెద్దలు వచ్చి గొడవ చేస్తారని అనుకున్నారు కానీ, ఎవ్వరూ రాలేదు. కట్టుబట్టలతో వచ్చిన కోడలిని ఆప్యాయంగా ఆదరించాడు.

బి.ఎ.లో కొన్ని సబ్జెక్ట్స్ ఉండిపోయాయని, రోజు చదువుకుంటున్నది అనేకంటే శివాజి వెంటాడి చదివిస్తున్నాడు.

అలవాటు ప్రకారం దేవయ్య వంట చేయడం, శివాజీ ఇతరత్రా పనులు చూసుకోవడం సరిపోయింది.

“సోనీ, దినంల ఒక్క పూటైన నువ్వొండు” లాలనగా అదుముకున్నాడు.

“శివా, నీకు మున్పే జెప్పిన, నాకే పన్రాదని.. ఇప్పుడేమో వంటని–తంటని నన్ను సతాయిస్తున్నవ్? నేను బిఏ పాస్ కావాలె, నీలాగ డ్యూటి జేసి మన పిల్లల కొరము రూపాల్ దాస్థ” పెళ్లికి ముందు ప్రేమించుకునే సమయంలో కన్న కలలు పునః ప్రకటించింది.

“అవ్వు. కరెక్టే! సయ్యి జెప్పినవ్గాని, నువ్వు గూడా జర పనిల..” శివాజీ నచ్చ చెప్పబోయాడు.

“మాట ఫిరాయిస్తే వూకోను! అందరోలే నేన్గాదు” సోనాబాయి విసురుగా జవాబిచ్చింది.

“పోన్లేరా శివా, మన ముగ్గుట్ల పనేంత? ఎట్లనో గట్ల నడ్పిద్దాం, కోడలమ్మ సద్కోనీ” దేవయ్య సంభాషణ పొడిగించలేదు.

★★★

కొత్త దంపతులకు సెలవు రోజు శ్రీరామ్ గారి కార్ తీసుకొని ఎంజాయ్ చేయడం పరిపాటయింది. మరొక మారు డిగ్రీ పరీక్ష తప్పింది.

“ఎడ్వకూ. అట్ల బయిట్కి సల్లగాలికి పోదాం పా” కారు కీస్ అడిగాడు.

“శివయ్యా, కారున్నది మన సోకులగ్గాదు. నువ్వు పైసల్ జమ జేసి సొంతం కారు కొన్ర. సేరు నా భరోస మీదప్పచెప్పిండు. భద్రంగ చూడాలే, నేను ఇయ్య” ఖరాకండిగా జవాబిచ్చాడు.

సోనాబాయి ఒళ్ళు మండింది “కుంటని తెల్సి గూడా మా యమ్మ నయిన మాటినక జిద్దు జేసి గవర్నమెంట్ డ్యూటి, పెద్ద బంగల, బండి, కార్లున్నయని పెండ్లి జేసుకున్న. అన్ని ఝూఠ లెక్కల్! ఇప్పుడేమో.. అవి ఎవలయోని నా సుకం దూరం జేస్తన్రా?” చెవుల కర్ణభేరి బద్దలయ్యే అరుపు అరిచింది.

“శివా, నీ పెండ్లానికి ఏం సోది జెప్పి ప్రేమల పడ్డావ్?” ఎంత కోపాన్ని అణచుకున్న చిరాకు స్వరంలో దాగలేదు.

“నా నౌకరి, నా జీతం; అంతే జెప్పిన. ఝూఠలు జెప్పలేదు బాపు” సంజాయిషీ ఇచ్చుకున్నాడు.

“అగో, నువ్వు జెప్పకపోతే.. సెంటు కొట్కోని, మస్తు షోకుల బోయి పెద్ద కార్ల రాజేష్ ఖన్నా లెక్క నా సుట్టూ చక్కర్లు కొడుతుంటే, శివ దేనుకున్న” తప్పంతా మీదే అన్నట్టు యుటర్న్ ఇచ్చింది.

“మనకున్న జాగీర్ కత ఇప్పుడు సెప్పురా!” నొక్కి పట్టి అన్నాడు. విషయం విని భోరున ఏడ్చేసింది.

'నేనెంత ధోక తిన్న!?' గొణుక్కుంది.

'ప్రేమ లేని పెండ్లి చేసుకుంటినా?' శివాజీ మనసు చితికి పోయింది.

★★★

'ఎన్టీఆర్ పర్సనల్టీ, సల్మాన్ కండలున్నయ్! మొగానికింత రంగేస్తే మస్తుగుంటవ్.. సిన్మాల పోరాదె.. పక్కా ఈరో ఐతవు!" ఎప్పుడూ నన్ను పొగిడే నా పెండ్లాం అంజాన్ కొడుతుంది. దీనికేమైంది??'

"హొట్టాకట్ట ఉండేటోడివి నీకేమైందిరా? ఏందో బిచ్చపోని లెక్క?" కొడుకు పీక్కుపోయిన ముఖం చూసి అన్నాడు.

"ఏం లే బాపు" దాటేశాడు.

"నీకు తాగాలనిపిస్తే తాజా ముంత కల్లు తాగు; ఏరేయి తాగకు." బాపు నిజం తెలుసుకున్నాడని సిగ్గు పడ్డాడు. కానీ తండ్రి మాట పెడచెవిన పెట్టాడు.

'తాజా కల్లు నిత్తెం దొరుకుడు కష్టం, డ్రింకయితే ఎప్పుడంటేటప్పుడు, ఏడంటాడ దొరక్తది. ఏదైతేంది? గుమ్మవ్వుడు లెక్క! మత్తెక్కి సోలి సొయ్యి పోతే సాలు' తనను తాను సమర్థించుకున్నాడు.

"నా తమ్ముని పెండ్లి ఖాయమైంది, మస్తు పైసున్నోల్లు! ఆడ్విడ్డ కట్నంగ నా బట్టలకు పదేలు, అద్దులం బంగారం ఇస్తుద్రు" సోనాబాయి సంతోషం పట్టలేక చెప్పింది. భర్త, మామ విన్నట్టు లేదని ఈ సారి అర్చింది.

"అబ్బో, ఒగలసోకు! మన పెండ్లి అయినంక మీ వోల్లు ఎవ్వలు నిన్ను కానక పాయిరి, ఇంతిదిగ ఆడిపిల్ల కట్నం ఇప్పిస్తున్నరంటే? ఏంది మాంల?" శివాజీ అనుమానంగా అడిగాడు.

"పేగు రిస్తంటే నీకేం ఎర్క! ఒంటి గానివి. ఎన్నటైకైనా ఆల్లు నా తల్లిగారోల్లు!! వెటకారం సంతోషం మిళితం చేసింది సోనాబాయి.

"అవ్వు శివా, కోడలమ్మ కన్నోల్లు.. ఆల్లంత మన సుట్టాలనుకుందారి. నువ్వు దిల్ శాఫ్ జేసుకో, అందట్ల గల్సి ఉండాలె" తండ్రి మాటకు ఆమోదం తెలిపాడు.

"ఎప్పుడన్న చుట్టి బెట్టు; బట్టలు కొన్కుందాం. అట్లనే నేన్ సొబ్బిగాని పెండ్లికి నల్ల పూసల్జేపిస్త!"

"నువ్వు పెండ్లి పెద్దక్క.. మంచి సీరె కొన్కో. మమ్ముల ఇడస బెట్టు" అత్తగారింటి సొత్తు వద్దనుకున్నాడు.

★★★

సోనాబాయి తమ్ముడు సొబన్ బాబు పెళ్లి ఆర్భాటంగా జరిగింది. ఆస్తిపరులు కాకున్నా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టారు. డిన్నర్ రోజు ఇంటి ముందున్న రోడ్డుకు మూడు దిక్కుల టెంట్ పరదా కట్టారు. అటు రోడ్డు జనాలు ఇటు; ఇటు రోడ్డు జనాలు అటు నడవలేరు. ఇక ఆ రోజుకు ప్రజల రోడ్డు పూర్తిగా ప్రైవేట్ అయ్యింది.

డ్రింక్స్ డిన్నర్ పార్టీ పెద్ద ఎత్తున నడుస్తోంది. మటన్ బిర్యానీ, జింజర్ చికెన్, ఫిష్ ఫ్రై, కాళ్ళ కూర షోర్వ, బోటి మసాలా ఘుమ ఘుమలు బస్తీని ఊరిస్తున్నాయి.

“ఈత కల్లు తప్ప ఏరేది నాకు పడదు” తప్పుకున్నాడు దేవయ్య.

“శివా, పురాగ మీ బాపుకు కల్సర్లేదు.  దావత్ మజ్జెల పోతే, ఏమన్న బాగుంటద? ఆడున్న మందంత మా సుట్టాలు, నువ్వు నా ఎంట రా.. నిన్ను కల్పిస్త” చేయి పట్టుకొని సరదాగా కూర్చుని మద్యం తాగుతున్న బృందం వైపు నడిచింది.

సినిమా పాటల హోరు జోరుగా ఉంది. రింగ రింగా పాటకు అందరూ డాన్స్ చేస్తున్నారు. ‘రాయిలాగా ఉన్న నన్ను..  రంగసాని చేసినారుగా..’

“అన్నా, ఏం పాట! సూపరు!!” పాటను ఎంజాయ్ చేస్తూ కోతి గంతులు వేస్తున్నారు.

‘ఒంటిలోని వాటరంత.. చమటలాగా పిండినారు, ఓంపులోని అత్తరంతా ఆవిరల్లే పీల్చినారు.. ఒంపి ఒంపి సొంపులన్నీ తాగేశారు..’

“అది! అట్ల గుమ్మయి పోవాలే! జబర్దస్త్ పాట రా..”

“నీయమ్మ, ఒట్టి పాటేందిరా? సిన్మాల డాన్స్ చూస్నవా? మస్తుంది రా!”

“అబే ఓ.. పోచిగా, అసలు ఐటం సాంగ్ లేందే సిన్మ నడ్వదు..”

“హేయ్ శివా!” అందరూ సంతోషంగా అరిచారు. ఒకరిని మించి ఒకరు డాన్స్తో ఊగిపోతున్నారు. అంతా మందు మత్తు మయం!

“శానా సీకటైంది, శివా! ఇంటికి పా.. తెల్లారంగనే నాకు ట్రాలీ బుకింగుంది” దేవయ్య తొందర పెట్టాడు.

“అట్ల ఎట్లంకుల్, ఇప్పుడే పార్టీ షురూ అయింది.”

“బాపు, నువ్వు ఇంటికి పో.. నేను మెల్లంగొస్త..” మత్తు ఎక్కి శివాజీ తండ్రితో చెప్పాడు.

“జల్ది రా బెటా.. లేకుంటే ఈడనే పండుకో మెల్లంగ పొద్దుగాల రా” తండ్రి వెళ్లిపోయాడు. పార్టీలో ఒకతను శివాజీని ఛాతీ పక్క ఎముకలు విరిగేట్టు గట్టిగా కౌగిలించుకుని గాలి లోకి ఎత్తాడు.

“హుర్రే! ఏం బాపు రా.. ఒక్క మాట నువ్వు చెప్పంగనే ఇంటి తొవ్వ పట్టిండు” మిగతా వారికి ఎవరెస్ట్ శిఖరం మీద జెండా పాతేసిన సంతోషం కలిగింది. అందరూ ఇంచుమించు ఒకే వయసు వారు కలిసి పార్టీ ఎంజాయ్మెంట్ మజా వేరుగా ఉంటుంది. సమయానికి ఏ ఐటెం సాంగ్ లౌడ్ స్పీకర్ లో పాడుతుంటే దానికి అనుగుణంగా తూలుతూ గంతులేస్తున్నారు.

సోనాబాయి ప్లేట్ నిండా జింజర్ చికెన్, ఫిష్ ఫ్రై తెచ్చి మందు విందు టేబుల్ నడుమ పెట్టింది. క్షణంలో ప్లేట్ ఖాళీ. “అక్కా, ప్లేట్ కాదు, బగోన నిండ తీస్కరా” చిరునవ్వుతో వెళ్ళింది.

“బాస్, శివుడు! ఫస్ట్ టైమ్ మా ఎంట ఎంజాయ్ చేస్తున్నవ్, బెట్టింగ్స్ కడదం. మజా ఉంటది!”

“అంటే..?”

“అంటే సింపుల్; ఇది ఫ్రెష్ ఫుల్ క్రేట్, ఎవలెక్కువ తాగే దమ్ముందో వాండ్లకు నూరు కే లు అంటే లక్ష! ఇనామ్. బెంటింగ్ టికెటొకటి వన్ కే.”

“లే.. లె, బెట్ కట్ట; నేను..” శివాజీ వెనుకంజ వేశాడు.

సోనాబాయి తమ్ముడి ఫ్రెండ్స్ కోరిక మేరకు పసందైన కూర తెచ్చింది. మందు మత్తు తోడు మాంసం నోరువూరిస్తుంది.

“అక్కా, బావకు దమ్ము లేదు, ఇన్ని రోజుల సంది బావకి పిర్కి మందు ఇచ్చినవా ఏంది?” ఎద్దేవ చేశారు.

“అట్లేం లే, మీ బావ ఫుల్లుగా తాగ్తడు. ఏంది శివా? ఆల్ల ముంగట నా ఇజ్జత్ తీస్తున్నవ్?” మోచేత్తో మొట్టింది.

“గదీ, అట్ల చెప్పక్కా.. ఇజ్జత్కా సవాల్!! లక్ష బెట్టు కట్కున్నం. బెట్టు గెలిసిన్దంటే, నా సామిరంగా.. సెకండ్ ట్రిప్ హనీమూన్!” వెకిలి నవ్వులు మారుమ్రోగాయి.

"ముందుగాల అనిమున్కే దిక్కు లే, రొండో దానికా? హు!" మూతి వంకర్లు తిప్పింది సోనీ.

"కమాన్.. చీర్స్!" గ్లాసులు గలగల మన్నాయి.

నెమ్మదిగా మొదలై వూపు అందుకుంది. ఒక్కొక్కరే తమ వల్ల కాదని తప్పుకున్నారు. "ఇగ సాలిస్త.. నాతోన గాదు" శివ తూలిపోతూ అన్నాడు.

"లక్ష రూపాల్ పోతయి.. పిచ్చిగ జేయకు. ఆఫీస్ లీవ్ బెట్టి రెండ్మూడు దినాల నిద్ర లెవ్వక పండ్కో, ఏంగాదు.. తాగు. బెట్టు కొట్టు!" ప్రోత్సహించింది.

శివాజీ తల భారంగా అయ్యింది. మసక, ఎటు చూసిన మసకబారిన మనుషులు.. సోనాబాయి మాటలు పొడుస్తున్నాయి, 'కుంటని తెల్సి గూడా మా యమ్మ నయిన మాటినక జిద్దు జేసి గవర్నమెంట్ డ్యూటి, పెద్ద బంగల, బండి, కార్లున్నయని పెండ్లి జేసుకున్న. అన్ని ఝూఠ లెక్కల్! ఇప్పుడేమో.. అవి ఎవలయోని నా సుకం దూరం జేస్తన్రా?'

నేను మస్తు లవ్ చేసిన, నా లవ్ను లాత్ తన్నకే, నా ముద్దుల సోనీ! నువ్వు తాగంటే తాగుతా, శావంటే శస్త! లక్ష గెల్సి నిన్ను ఖుష్ పెడ్త!!

కడుపులో వరుస సీసాల కొద్ది అల్కోహాల్ ఇమడలేక పోతున్నది, అయినా పంతం గెలవాలి; తాను ప్రేమించిన భార్య కోరిక తీర్చాలి. గెలిసి లక్ష దక్కించుకున్నాడు. ఎక్కడి వాళ్ళు అక్కడే తూలి నేలపై దొర్లు తున్నారు. సోనాబాయి జాకెట్టు లోపల దాచుకున్న చిన్న సంచిలో లక్ష రూపాయలు భద్రపరచుకున్నది. మొగుడి చేయి పట్టుకొని కుదిపినా లేవలేదు. అక్కడే పడుకో పెట్టి దుప్పటి కప్పేసింది.

★★★

"అయ్యో! నా బిడ్డా! శివా ఏమైంది రా.." అని కొడుకు శవం పట్టుకొని ఊపుతూ ఏడుస్తున్నాడు తండ్రి. శివాజీ శవం పోస్టుమార్టం కోసం వెళ్ళింది. బెట్టు కట్టి గెలిచిన లక్ష రూపాయలు పోలీసు మార్చురీ మామూళ్లకు, చావు ఖర్చు, కర్మ దినాలకు సరిపోయాయి.

మిగిలిందల్లా 'శివ చాలా మంచోడు' అని ఆఫీస్ స్టాఫ్ బిరుదు ఇచ్చి వెళ్ళిపోయారు. పోయే రోజు ఏమి తీసుకొని పోము, మనిషికి కావలసింది అదే కదా! అనుకుంది సోనాబాయి.

కానీ సగటు తండ్రికి కావలసింది కొడుకు! వాడి అభివృద్ధి!! కొడుకు సంపాదించిన 'శివ మంచోడన్న బిరుదు' ఎందుకోసం? ఎవడిక్కావాలి??

ఆఫీస్ చీఫ్ వచ్చి దేవయ్యను, సోనాబాయిని పలుకరించారు. "బాధపడకండి, నా వంతుగా మీ ఇంటి నుంచి అంటే మీ ఇద్దరిలో ఒకరికి నేను మా ఆఫీసులో ఉద్యోగం వచ్చేట్టు చూస్తాను. రెండు లేదంటే మూడు నెలల టైమ్ ఇవ్వండి. మీరు ఆలోచించి డిసైడ్ చేసి వచ్చే వారం చెప్పండి. షూర్.. మీకు అనువైన జాబ్ దొరుకుతుంది" హామీ ఇచ్చారు.

"నా మొగని డ్యూటి నాకిప్పించు సారు. మా మామ ఆటో ట్రాలీ నడిపించుకుంటడు, నాకు కంపూటరొచ్చు. ఈ పారి కంపర్ట్మెంట్ల పాసయిత" భరోసా ఇచ్చింది సోనాబాయి.

"మీ వారు.. అదే శివాజీ చేసే సేమ్ ఉద్యోగం రాదమ్మా, వేరే ఏదైనా చూద్దాం. ఇంటి పెద్ద మనిషిగా మీరు ఏమంటారు?" దేవయ్య కేసి చూపు నిలిపి ప్రశ్నించాడు.

"ఏమంట అయ్యా! నా ఇంటి దీపం గాల్లా కొటక పాయే! చీకట్ల బతకాలే!! నా బతుకు ఏం జేసుకోనూ?" కన్నీటి వూట ఆగలేదు.

★★★

సోనాబాయి ఉసూరని ఇల్లు చేరింది. "శానా తకాయించి పోతున్న, ఎంత పన్జేసినా ఆఫీసు పని అయిపోతలే!" వంట పని, ఇంటి పని దేవయ్య చేసుకుంటూ మాటలు వచ్చిన మూగవాడైనాడు.

మొదటి జీతం రాగానే కొత్త చీరలు, మ్యాచింగ్లు, ముస్తాబు సామాన్లు కొన్నది. "బాయి, నా ట్రాలీ గిరాకీల పైసలెమీ మిగల్తలే. ఇంట్ల సౌదాలు ఐయిపోయినై, రేపు కొన్క.."

"నేను కారు కొంట. ఇంట్ల సౌదాలు కొన. వంట బంజేస్తం; టిఫిన్ సెంటర్లు, కర్రీ పాయింట్లు మస్తున్నయి, ఆడ తిందాము." ఆఫీస్ కాంటీన్లో కడుపు ఆకలి తీర్చుకున్న సోనాబాయికి దేవయ్య ఆకలి బాధ అర్థం కాలేదు.

"అయి ప్రియం తల్లి, నా మాటిను.. నా ఒంట బాగ లేక పోతే నువ్వందు, మంచిగ ఇద్రం తిందారి. రోట్ల ఏదైనా తొక్కు నూర్త; నెయ్యి సుక్కతోనో, నూనె బొట్టేస్కొనో తిందాము."

"వద్దు, నాకొంట ఎర్కలే, రోట్ల తొక్కులు వాక్కే! డ్యూటి జేస్తూన్న! సంపాయిస్తున్న!" అక్కడున్న కుర్చీలో దర్జాగా కూర్చుంది.

ఎదో చెప్పబోయాడు దేవయ్య. చెప్పనీయలేదు "ఏందీ ట్రాలీ దందల పైసల్మిగుల్త లేవా? కల్లు తాగనికే మిగుల్తున్నాయ్? సౌదాల్ నేన్ కొన్క రావాల్న? ఆ..? ఈ ఇంటికి మొగోన్ని నేనా? నువ్వా?"

ఏమని జవాబివ్వాలో తెలియక కింద కూర్చున్నాడు. "మొత్తమింటి కర్చు నా ఒక్కన్తోన గాదు, చెరి సగం ఏసుకుందాం" ఒప్పందానికి వచ్చాడు.

"సీదా ఇప్పుడొచ్చినవా దార్లకు; శివ లేకుంటే ఇల్లు జిమ్మేవార్ నీది! నేన్ నా జీతంల ఇల్లు కొంట! నీకియ్య, ఇగ నీ జులుం బంద్!!" తిరుగు మాటల కోసం ఎదురు చూడలేదు.

"నా జులుం? నేనెమన్న బాయి? ఒక్క మంచి మాటనొద్దా?" నెవ్వరపోయాడు.

"నువ్వంటే.. నేన్ పడ!" నోరు మూయించే ప్రయత్నం ఫలించింది.

మరొక నెల జీతంలో ఇంటి అలంకరణ కోసం ఏవేవో తీసుకొచ్చింది. రుబ్బురోలు, రోకలి తీసి ఇంటి గేటు పక్కన పడేసింది.

"ఇల్లు సూడు రోనకొచ్చింది" మురిసిపోయింది. కోడలు చేసే వృధా ఖర్చు మాన్పించాలి, ఆలోచించసాగాడు.

★★★

"నా ఆఫీసోల్లు వస్తరు, ఏదీ బద్తది ఒర్లక నోర్మూసుకో" వరుస పెట్టి పిలవడం మానేసి కొత్త రూల్ పెట్టింది.

ఎవరో తుర్కాయన "ఖాన్ సాబ్" పరిచయం చేసింది. సోనాబాయి చేతికి కొత్త వాచ్ తొడిగించాడు. "మేము లివింగ్ రిలేషన్ లో ఉందామని నిశ్చయించుకున్నాం" అన్నాడు.

అంటే?.. "అంటే ఏంటిది బాబు.. సాబు?" అమాయకంగా అడిగాడు.

"అంటే ఇక్కడ మేము మిల్కే ఉంటాం. నహీ చలా తో విడి పోతాము."

"నీకు ఇల్లు లేదా కొడ్కా?" మాటలను నిమిరాడు.

"సాబ్కు అన్ని వున్నయ్, ఇదేమన్న నీ సొంతమిల్లా? పుకట్ల ఉంటున్నవ్. వచ్చినోల్లను అదని, ఇదని సతాయించకు గమ్మున ఊకో?" సోనాబాయి జోక్యం కల్గించుకుంది.

"నేను హమేషా ఇక్కడ ఉండను, ఏకాత్బార్ వస్త. తక్లీఫ్ ఏమి ఉండదు" నమ్రతగా అన్నాడు.

ఏదో తేడాగా ఉందని "సాబు, బయట ఎవల్లన్నడిగితే ఏం చెప్పాలే?"

"నీ సుట్టం వచ్చిండని చెప్పు.. నీష్టం ఒచ్చింది చెప్పుకో" పొగరుగా చెప్పింది.

"సాబ్! నీకు తెల్సా?.. వీడు కూడా.. అదే శివ నయిన పెండ్లి చేసుకోక అత్తమ్మను లేపక ఒచ్చిన ముచ్చటంట" పకపకా నవ్వింది. దేవయ్య మనసు గతుక్కుమంది.

"ముసలోడు ఏందో వాగ్తడు; సాబ్ ఛలో, మనం బిర్యానీ తిందారి" బ్యాగులో నుండి ఘుమ ఘుమ లాడే బిర్యానీ ప్యాకెట్ తీసి అతిథి జబ్బ పట్టుకుని లేపింది. విసురుగా తలుపేసుకున్నారు.

దేవయ్య మనసు చెమ్మగిల్లింది, అందరిని పిల్చి రచ్చ చేస్తే? నా సిగ్గే పోతది. ఇంగ్లీష్ల ఏమో అన్నరు.. ఎందది?.. 'లివింగు రిలేషను' అంటే ఇట్లన!? నా కోడల్కు మొగని సుఖం కావాలంటే, నాకు చెప్పేద్దుండే, ఫిఖరే లేదు; మంచి పిల్లగాన్ని మారు లగ్గం చేద్దును. కోడల్గాదు బిడ్డ అనుకొందు. తాసిలి పని, థూ!? పాడు ముండ! దీనికి బుద్ధి చెప్పలే.. ఎట్ల చెప్పాలే??

★★★

"హలో దేవయ్యా బాగున్నవా?" శ్రీరామ్ ఫోన్ అందుకున్నాడు.

"నమస్తే సారు, బాగున్న."

"నా భార్య చెల్లెలి.. అదే నా మరదలు కొడుకు.. కిరణ్ అని పోలీస్ డిపార్ట్మెంట్ జాబ్ వచ్చింది. నా ఇల్లు వాడుకుంటాడు, ఇల్లు నీట్ గా పెట్టు. వాడికి ఏమి కావాలన్నా చూసుకో, ప్లీజ్."

"సారు, ఇల్లు శానా మంచిగ పెట్టిన, ఎన్నడయినా సుట్టాలు రావొచ్చు, వుండొచ్చు. మీరు ఎప్పుడొస్తరు?"

"వస్తా, ఇంకా కొన్ని రోజులు అవుతుంది. ఇప్పుడు కొడుకు దగ్గర నుండి వేరే దేశం.. నా బిడ్డ దగ్గరికి పోతున్నాను."

"మంచిది సారు" దేవయ్య మరో మారు ఇల్లంతా శుభ్రపరిచాడు.

కిరణ్ వచ్చి వారం అయింది, "పోలిసంటే ముందుగాల బుగుల్బడ్డ, మస్తుగున్నవ్! దోస్త్ లెక్క" దేవయ్య కిరణ్ స్నేహాన్ని పొగిడాడు.

"అంతే గదా, పోలీసోలు అందరికి దోస్తులే.." ఇద్దరిలో స్నేహం చోటు చేసుకుంది. దేవయ్య కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు.

"దేవయ్య, నీళ్లు తేడా చేసినట్టుంది. సర్ది అయింది, ఏం తిన్నా రుచిగా లేదు" బొంగురుపోయిన గొంతు ఇబ్బంది చెప్పాడు కిరణ్.

"నేను ఎల్లిపాయ కారం నూర్కొస్త, ఉడుకుడుకు బువ్వల కారమేస్క తింటే నోటికి రుసొస్తది" తోచిన ప్రదమ చికిత్స ప్రకటించాడు.

గేటు పక్కన బోరింగ్ చుట్టూ పచ్చగా పేరుకుపోయిన నాచు, అక్కడక్కడ పెరిగిన పిచ్చి మొక్కల మధ్య అనాధగా పడ్డ రుబ్బురోలు శుభ్రం చేసి ఎల్లిపాయ కారం నూరాడు.

'ఏందో కాలమ్తీరు? సలికాలం రాంగనే సెట్ల ఆకుల పొంటి చీడ పడ్తది. ధమాక్ సరిగ లేక సెట్లను చూస్కం ఐతనే లేదు. టేం తీస్కోని ఆకంత దుయ్యాలె' కాంపౌండ్ గోడ చుట్టూ ఉన్న మొక్కలకు పట్టిన చీడను చూస్తూ అనుకున్నాడు.

టైమ్ గాని టైమ్లో సోనాబాయి మరొకతనితో గేటు తీసుకొని వచ్చింది. దేవయ్య ముఖం వైపు చూసి "జాకబ్, నా ఆఫీసు.." మారు మాట వినకుండా లోపలికి అతనితో వెళ్ళింది.

'బాయి నా ఇల్లు మంట్ల గల్పుతున్ది, తప్పు జేస్తుంది' రోలు శుభ్రంగా కడిగి, ఎల్లిపాయ కారం నూరాడు.

"కోడలమ్మ.. వీడెవడు?" ఇంట్లోకి అడుగు పెడుతూ అన్నాడు.

"వీడనకు, పెద్ద సారను. బయటున్నోడివి ఎందుకొచ్చినవ్?" అధికారంతో అన్నది.

"కటొర కావాలే, ఎల్లిపాయ కారం ఎత్తుత" దేవయ్య వింతగా వచ్చిన అతన్ని చూశాడు.

"మేము 'సహజీవనం' చేయ్యాలని అనుకున్నాము" కొత్త వ్యక్తి ఆనందంగా అన్నాడు.

"మా ఇష్టమైనన్ని రోజులు కల్సి వుంటం, లేకుంటే అలగ్! నీకు నా తీరు పసంద్ లేకుంటే నోరు మూస్క ఉండు, లేకుంటే బయిట్కి నడు" హూంకరించింది.

బయటికి అయితే వెళ్ళాడు కాని నోరు మూసుకో లేదు, అతని బాధ కిరణ్ విన్నాడు.

"ఎల్లిపాయ కారం చాలా బాగుంది" వాస్తవం ఒప్పుకుంటూ మాట మార్చాడు.

"ఇది బాగా లేదు సార్, ఒక మొగడు! ఒక పెండ్లాం! పిల్లలు!! సంసారం బాగుంటది. వద్దు సారు; ఇట్ల మంచిగ లేదు సార్" దేవయ్య వ్యధ అర్థమైంది.

"నువ్వు చూస్తున్నది ఒక్కరిని మాత్రమే, మా డిపార్ట్మెంట్ లో ఇట్లా ఎన్నో.."

"అంటేంది సార్?"

"వివాహేతర సంబంధాలు, సహజీవన విధానం వలన జీవితంలో నైతిక విలువలు మటుమాయమవు తున్నాయి."

"నా నెత్తి కెక్కలేదు సారు" అర్థం కాలేదు దేవయ్యకు.

"సహజీవనం అనే పేరుతో కొన్నాళ్ళు ఉండి, కుదరటం లేదని వదిలేసి వేరే కొత్త బంధాలు పెట్టుకుని బతుకులు సాగిస్తున్నారు. గడిపిన పాత సంబంధాలతో ప్రాణభయం ఉందని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూ మా ప్రాణాలు తీస్తున్నారు. సులువుగా కడుపు తీయించుకుంటున్నారు. శరీరాన్ని చెత్తకుండి చేసి ఆరోగ్యానికి ముప్పు తెచ్చుకుంటున్నారు" ఆవేశంగా చెప్తున్నా కిరణ్ మాటలు దేవయ్య వింటున్నాడు.

"పోలీస్ ఉద్యోగంలో చేరి సమాజంలో శాంతి, సామరస్యాన్ని కాపాడే బాధ్యత స్వీకరించి ప్రజా భద్రతను నిర్వహించడం, చట్ట నియమాలు సమర్థించడం, నేరాలు, ఘోరాలు జరగకుండా చూడటం, నేరస్తులను గుర్తించి న్యాయస్థానం ముందుకు తీసుకురావడం మా విధి!

ఇవన్నీ పక్కన పెట్టి 'లివింగ్ రిలేషన్' పేరిట వేషం మార్చిన అవివాహితులు, వివాహితలు ఇచ్చిన కంప్లైంట్ రిపోర్ట్ పట్టుకుని వాటి వెంట ఆరా తీస్తూ ఉంటే పోలీస్ పవిత్రత పోతుంది" వ్యథ వెళ్లబుచ్చాడు.

"సమజైంది సార్, గలీజోల్ల పన్జేసి మీరు మంచి జీతం దీసుకుంటరు. ఇంటి కాడా నేను మంచి పన్జేసినా గలీజు పన్లు జూస్తున్న. నాతోన ఐత లేద్సర్. నేనొక మాట జెప్త ఇంటవా?" గుస గుస లాడాడు.

★★★

పోలీసు సారు ఏం అడ్గుతడో? గుండె జల్ది జల్ది కొట్టుకుంటుంది "నమస్తే సారు, నన్ను యాద్ చెసింద్రంట" సోనాబాయి నసుగుతూ కిరణ్ ముందు చేతులు కట్టుకుని నిలబడ్డది.

"నమస్తే. మీ ఉద్యోగం ఎలా ఉంది?" కిరణ్ గౌరవంగా అడిగాడు.

"బాగనే ఉంది" సోనాబాయి స్వరంలో భయం దాచినది.

“చూడమ్మా, దేవయ్య ఇన్నాళ్ళూ మా వద్ద చేసిన పనికి ఎంతో థాంక్స్ చెప్పాలి. ఇప్పుడు అతని అవసరం లేదు. మీరు ఉంటున్న ఇల్లు ఖాళీ చేయాలి. మీరు ఇంటి భారం అంటే.. అదే మీరు సంపాదిస్తున్నారు; ఇంటి జమాఖర్చులు చూస్తూ పెద్దరికం వహిస్తున్నారు కనుక మీకు ప్రత్యేకంగా ఒక నెల ముందు చెప్తున్నాను; మీరు వేరే ఇల్లు చూసుకోండి.”

“అయ్యో! అదేంది, ఏడికి పోతం?”

“మీ ఇష్టం. అడ్వాన్స్ గా ముందే చెప్తున్నాను.”

“అయినా, ఈ ఇంటోనరు ఈడ లేదు? నువ్వెందుకు పొమ్మంటవు?”

“ఇంటి ఓనర్ నాకు పెద్ద నాయన, ఆయనే చెప్పారు. ఫోన్ చేసి మాట్లాడిస్తాను. మాట్లాడండి?”

“సా.రు.., వద్దు సారు, పెద్ద సారు చెప్తే నే గంద, మీరు చెప్తుంద్రు” దేవయ్య బెంబేలు పడ్డాడు.

సోనాబాయి మామగారి వైపు బేలగా చూసింది.

“ఈడ ఒక్క పైస కిరాయి లేదు. నల్ల, లైటు.. కరుసు లేదు. ఏం జేస్తం? ఈడ మా నీల్ల బాకీ ఖతం అయ్యింది. నెలల ఏరిల్లు సుస్కుంటం” దేవయ్య నిట్టూర్పు విడిచాడు.

సోనాబాయి వైపు చూస్తూ “బాయి, పోదాం పా. సమస్తే సారు” హడావిడి చేశాడు.

“నేను సార్తోన మాట్లడత, నువ్వు పో” అక్కడే నేల పైన కూర్చుంది.

“నాతోనా? ఏం మాట్లాడాలి?” ఆశ్చర్య పోయాడు కిరణ్.

“సీదా ఇల్లు కాల్జేయమంటే, చేతరి. సార్తో ఇగ ఇంకేం ముచ్చటున్నది?” గాబరా పడ్డాడు దేవయ్య.

“సారు, దండం పెడతా, జర్ర నా మాటిను” బతిమీలాడింది.

“వింటాను. కాని దేవయ్య కూడా వినాలి.” దేవయ్య చేతిని వెళ్లొద్దని పట్టుకున్నాడు. సముచితంగా తోచి తలాడించాడు దేవయ్య.

“ఆ.. ఇననీ, నేన్ జెప్త; బుగులేమిట్కి” శ్రోత లిరువురూ చెవులు రిక్క పొడుచుకున్నారు.

“సారు, నేను సెడ్డ దాన్ని; మంచి గునం లేని దాన్నని మమ్ముల ఎల్లగొడుతున్నవ్ లె?” సూటిగా కిరణ్ కళ్ళల్లోకి చూస్తూ నిలదీసింది.

ఒక్క నిమిషం ఆలోచించి “మీరు  మంచి అనుకున్న పని వేరే వాళ్ళకు చెడు కావొచ్చు, మీకు చెడుగా తోచిన పని వేరే వారికి మంచి కావచ్చు. ఎవరి ఆలోచనలు, భావనలు వారివి. నేను మీకు మంచి–చెడ్డల గురించి చెప్పే పెద్ద మనిషిని కాను” సందిగ్ధత వలన తప్పించుకునే ప్రయత్నం చేశాడు.

సన్నగా నవ్వుకుంది సోనాబాయి “నిన్ను నేను పేరు బెట్టి పిల్వ. సారు అని గూడ పిల్వ” విస్తుపోయి ఎందుకు అన్నట్టు ఆమె వైపు చూసాడు కిరణ్.

“అన్న గూడ అన. నువ్వొక దోస్త్. నా మంచి–సెడ్డల అరుస్కునే దోస్త్. సర్నా?” సరే అని తల ఊపాడు.

“నా కత ఇను, నేనేం జెయ్యాల్నో జెప్పు” సోనాబాయి బుద్ధిగా చెప్పింది.

“నేను పోలీసు ఉద్యోగిని, నేను మీ కథ విని సలహా ఇవ్వలేను” కిరణ్ యుక్తిగా అన్నాడు.

“ఎంత పోలిసయిన, మనిసివే, మొగోనివే గంద. ఇను.. జర్ర ఇను” దొరికిన అవకాశం వినియోగించుకోవాలని మొండిగా కూర్చుంది. ఇష్టం లేకున్నా దేవయ్య తరపు మనిషి కనుక వినక తప్పలేదు.

“మా నాయిన మేస్త్రి. పనికి పోడు. పొద్దుగాల, పొద్దుమీకే బగ్గ తాగుడు, అరుసుడు, అమ్మను ఇయ్యర–మయ్యర జోపుకొనుడు. అమ్మ ఆడీడ సఫాయి పన్లు జేసిన పైసల్ను నయిన దొంగలిచ్చకం. ఒక్క కిరాయి కొటిడి. బాడందరికి సర్కారీ పైకానలే.

శిగ్గు–శరం ఇడ్సబెట్టి, మేం పండక మున్నే, మా ముంగట్నే నయిన అమ్మ తోటి..., తన్పని జెస్కొని లేసి, ‘దమ్మేలే.. బొక్కల పీన్గదానా.. లే,  ము..’ కాల్తో లాత్ తన్నేటోడు. పీన్గ లెక్కనే ఏడ్పదు నవ్వదు మా యమ్మ.

ముందుగాల అమ్మను నయినను అట్ల జూసుడు గలీజు గుండె; రాంగా రాంగా శివ ను జూసినంక.. శానా పసందయిండు. నాకొక మొగడు, బంగల, తిరగనికే బండి, పండు కోనీకే అలాగ కొటిడి, బెడ్డు.. ఇలాగ వూకే ఆలొసన జేసిన.. అయితదా? కాదు. ఎందుగ్గాదు? ఎట్ల గాదు??

నేనెమన్న ఎండి–బంగరం ఆస పడ్తినా? అందరోలే కండలు పైసలు గల్ల మొగడు, సొంతమిల్లు, సక్కంగ.. నాకొక మొగడు, నేను గన్న.. నా కాస కొడుకు, బిడ్డ! ఇంతనే.. ఇంతే నాగ్గావాలే! ఇదేమన్న కస్టమా?

శివ ఒక్కడే కొడుకు, ముందేనకాల ఆడీ ఇల్లల్లేరు. బంగ్ల, కారు, గవర్నమెంటు నౌకరీ జూసి శివ సక్కగా సరైనోడని దైర్నం ఒచ్చింది. ముందుగాల నేనే లవ్వు జెస్కం షుర్వయ్యింది. మొండి పిల్లగాడు! సదువని నా ఎంట మస్తు

సతాయించిండు. గవర్నమెంట్ స్కూల్ల సదువు ఎల్ల బెట్టిన. అట్లిట్ల పదోది పాసైన. ఓపన్ ఊన్వర్సిటీల పరిక్ష ఎట్లనో జిద్దు చేసి రాపించి, పాస్ జేపించిండు. బిఎ కట్టిపిచ్చిండు శివ.

కుంటోడని ఇంటికాడ వద్దన్నరు. అయిన గూడ గుడ్ల పెండ్లి జేసుకన్న. నా కిస్మత్ బాగలేక పాయే; ముండమోసిన. కొలువు దొరికింది.

నాకు ఈ దేవయ్య మామాంటే అస్సలు సైసదు. ఆయనిష్టం నడ్సాలంటే అయితదా? ఫాల్తు యేశాలు! ఫేసన్గ వుండడు, నన్నూండనీడు.

కొలువు కాడ మొగోల్ల దిమాఖ్ సరిగ లేదు. ఛీ, డ్యూటి జేయక ధమాక్ తింటరు! నా పెయ్యి మీద ఏడంటే ఆడ తాకుడు, గిచ్చుడు, ఎవ్వలు లేంది జూసీ గులగుల పెట్టి, ఏడంటే ఆడ ముట్టుడు. ఏమన్నంటె, ఓ.. పేద్ద లొల్లి! ఆల్లు బాగనే వుంటరు. నాకే తీట లేసిందని ఉల్ట బద్నాం చేసుడు. దునియెంత కరాబున్నది? సక్కగ బతకరు! బతకనియ్యరు!! బాగ ఆలొసన జేసిన. గవర్నమెంటు 'లివింగు రిలేషను' నడుస్తదని ఫైశలా ఇచ్చింద్రంట.

నాకా.. సక్కని సంసారం కావాలే, గందుకే గదే.. నా సుట్టు-ముట్టు తిరిగే మొగోల్లను అర్సుకున్న. ఉంచుకున్న దన్లాగ అంటే.. పెండ్లి అంటే ఒల్ల అనబట్టిరి. సవితి లెక్క నన్న వుంటని వకిద్దరిని ఇంటికి తొల్కొచ్చిన. ఆల్లకు.. నా పెయ్యి గావలంట, నా పోరలు వద్దంట! ఆడి దానికి పండుడే గాదు.. పిల్లలు, సంసారం గూడ కావలే అని ఎవ్వలకు తొయ్యదు" కంట తడి తుడుచుకుంది.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి "మీ మనసులోని కలవరం అర్థమైంది. నా సలహా వింటారా?" కిరణ్ ఓదార్పుగా అన్నాడు.

వింటానని తల ఊపింది. "ఈ సమస్యకు పరిష్కారం ఏమిటంటే, అనాధాశ్రమం నుండి బాబు లేదా పాపను తెచ్చి పెంచుకో. ఇక మగ తోడు-నీడ గురించి ఆలోచించక మీ మామను నీ తండ్రి గా భావించి ఆత్మీయంగా ఉంటే బాగుంటుంది."

పేలవంగా నవ్వింది. బహు చక్కని సలహా ఇచ్చాడని దేవయ్య సంతోషంగా అటు ఇటు తల ఊపాడు.

"సొన్నాయిస్త!" వెళ్ళడం కోసం నిలబడ్డది.

"మనం మన దేశ వివాహ పవిత్రతను కాపాడుకోవాలి. సహజీవనం, లివింగ్ రిలేషన్ బంధాలు అన్నీ తాత్కాలికం. వీటి వలన ఉపయోగం కంటే అపాయం ఎక్కువ" కొసమెరుపు అందించాడు కిరణ్.

“మంచిది. సారు.. దండం” నమస్కారం పెట్టింది. నిస్సత్తువగా కాళ్ళీడ్చుకుంటూ సోనాబాయి ఇంట్లో అడుగు పెట్టింది.

★★★

“మామా!” చాలా రోజుల తర్వాత మర్యాదగా పిలిచింది.

“ఏంది తల్లీ?” అనునయం.

“నా ధిమాక్ రాయి లాగుంది, ఎంచ్చేద్దారి? అనుమానంగా సోనాబాయి అంది.

“మనిద్దర్కి ఒక్క కొటిడి సాలు. దొరకంగనే, ఎల్లి పోతాం” సమర్థించాడు.

“మల్లోక్క పారి నువ్వు సార్ను ఉంటమని అడుగు. ఈడన్ని పుక్కట్ల వున్నయ్. బైటికి పోతే మస్తు పైసలైతయి” పునరాలోచన చేసింది.

“ఎక్వ అడిగింజకం బాగ్గొట్టదు. నా మోకాల్ల గుంజకం శానా అయ్యింది. ఊకేనే సుస్తని పిస్తుంది. మీ దొస్తుల అర్సుకో.”

సోనాబాయి ఏమీ మాట్లాడలేక పోయింది. రాత్రంతా నిద్ర పట్టలేదు. ఆలోచనలకు అంతం లేదు. పొద్దున్నే ఇద్దరికీ టీ చేశాడు. గోడ చుట్టూ ఉన్న చెట్ల ఆకులకు పట్టిన చీడ ను తొలగించి జల్లించిన బూడిద చిమ్ముతున్నాడు.

“ఆల్లు ఇంట్ల నుండి ఎల్లి పో అంటే.. నువ్వేంది? చీడాకుల దూస్తున్నవూ?” చిరాగ్గా అంది.

“పువ్వు, కాయ, పండు ఇచ్చే సెట్లు! మనల ఏమన్నయి? చీడ అట్లనే ఉంచితే సెట్టు సచ్చి పోతది.”

“పోనీ, పీడ పోతది. నీ యమ్మ, నీయతు లెనోల్లు.. ఇల్లొదిలి ఏడికి పోతం?”

“చా తాగు పో, సల్ల గైతది” దేవయ్య గుర్తు చేశాడు.

“సల్లగ అయ్యి పాయే” సోనాబాయి పక్కనే ఉన్న సిమెంట్ బెంచ్ మీద కూర్చుంది.

“మామా నా మాటిను..” దేవయ్య కోడలు దగ్గరగా వచ్చి నిలుచున్నాడు.

“ఇగో, ఇప్పటి సంది నీ బువ్వ, నీ జిమ్మెదార్ నాతోన గాదు. నాది నేను జుస్కుంట. నీకు నాకు వాస్త లేదు” తీర్మానం తెలియచేసింది.

"అయ్యో, గదెంది? సారు మనల పొమ్మన్నడు. ఈడ నా డ్యూటీ పీకి పెట్టింఁడు. ఇద్రం ఒక తాన్నే ఉందం" తొట్రుపాటు చెందాడు.

"నేనేం జెప్పిన? సమజ్ కాలే?" ధిక్కరించింది. మాట్లాడక బిక్కముఖం వేసుకున్నాడు దేవయ్య.

"మల్ల జేప్తున్న బాగిను. నేన్ నీ తోనుండ. అలగ్ పోత. నా జీతంల ఒక్క పైస ఇయ్య" ఆజ్ఞ జారీ చేసింది.

"నేనేట్ల బతకాలే బాయి?" బిత్తరపోయాడు.

"నా కెర్క లే.. ఎవలన్న కోడలేదంటే, ఏం చేప్తవ్?" ఎదురు ప్రశ్నించింది.

"ఏం చెప్పాలె?" అమాయకంగా అడిగాడు దేవయ్య.

"తల్లి కాడ ఇడిసొచ్చిన అన్జెప్పు" తృప్తిగా సమాధానం ఇచ్చింది.

"బాయి, దునియా ఖరాబున్నది, ఒక్కాడిపిల్ల అలాగ్ ఉండుడు.. నిన్ను బతకనియ్యరు; సక్కనైన జోడి ఎతికి మల్ల పెండ్లి జేస్త. ఈడనే ఉండు" మామ కోడలికి నచ్చచెప్పాడు.

"ఉండ. నాకెట్ల పిల్లలు కావల్నని పానం కొట్టుకుంటదొ, గట్లే మా అమ్మ పానం గూడ అట్లే కొట్టుకుంటది. ఒక్కనాడన్న మా అమ్మ ఖుషీగా లేకపాయే. పెండ్లని నేనిడికి వస్తి; సొబ్బిగాడేమో పెండ్లాం తొవ్వ పట్టి, అలగ్బోయిండు. మా అమ్మ బతికి సస్తున్నది. మా నాయిన సచ్చుకుంట బతుకుతుండు. రిస్తలన్ని బక్వాస్!

మా యమ్మ కడుపుల బుట్టిన బిడ్డలం సోన్బాయి, సొబన్బాబుల పానాలు కొట్కలాడుతున్నా? 'అమ్మ' కడుపుల మంట కాంతలేం! నాకు మొగడొద్దు, పోరలొద్దు" బట్టలు సర్దుకుంది.

"మొగడొద్దు, పోరలొద్దు అన్న దాన్వి నల్లపూసల గొల్సు ఎందొక్కొండ బోతున్నవ్?" అనుమానంగా అడిగాడు దేవయ్య.

"నా నల్లపూసలు ఇక్కడేం జేస్తయి, మా అమ్మ కిస్త. ఆడొల్ల సంసారం ఖుషిగ లేకున్నా, ఇగో.. ఈ నల్లపూసలు మెడల ఎస్కొని పెనిమిటి సల్లంగా ఉంటదని, సంసారానికి దిష్టి తాకదని భరోసా!" తదుపరి ప్రశ్నకు అవకాశం ఇవ్వకుండా బ్యాగ్ లో శ్రద్ధగా దాచుకుంది.

★★★

విదేశాల నుండి శ్రీరామ్ వచ్చి విషయం తెలుసుకున్నారు "దేవయ్యా, నువ్వు నాతో పాటే మా ఇంట్లో ఉండు" బుజం మీద చేయి వేసి నిమురుతూ అన్నారు.

"దేవుడేట్ల జేప్తే అట్ల, రాములోరి మాటినక ఏడికి పోత సారు" దేవయ్య శ్రీ రామ్ కాళ్ళు మొక్కాడు.

★★★★★

COMMENTS